క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా/మానవపాడు: న్యాయ స్థానాల్లో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐలు కృష్ణదేవా, రాము శుక్రవారం తెలిపారు. కోర్టు కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. రాజీమార్గంతో పరిష్కరించబడే కేసులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా ఇరువర్గాలు పరస్పర అవగాహనతో ముందుకు రావాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు, చీటింగ్, భూతగాదాలు, ట్రాఫిక్, పిట్టి, డ్రంకన్ డ్రైవ్ తదితర కేసులను ఇరువర్గాలు రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

పీఈటీకి సన్మానం



అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడు ఉన్నత పాఠశాల పీఈటీ నిర్మలాదేవి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు ఆమెను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు జగదీష్, మల్లేశ్వరి, రాఘవేంద్ర, సాజిదా, సుబ్బన్న, శ్యాంప్రసాద్, సూర్యచంద్ర, శివరాజ్, పరుశరాం పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కన్వీనర్‌గా షాహిన్

అలంపూర్: బహుజన సమాజ్ పార్టీ ఉండవెల్లి మండల మహిళా కన్వీనర్‌గా షాహిన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ ఆమెకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుపాల్, ప్రభుదాస్, శోభారాణి, మల్లేశ్వరి, శివశంకర్‌గౌడు, రవి, శివ, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి చెందిన సూరి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత శుక్రవారం ఎర్రవల్లిలో సూరి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె వెంట సర్పంచ్ జోగుల రవి, వెంకటన్న, రాజశేఖర్‌రెడ్డి, అంజి, పరుశరాం, కృష్ణ, రవి తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం



గట్టు: మండలంలోని చౌడేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఎస్ఎస్‌కే సమాజ్ కమ్యూనిటీహాల్‌ను శుక్రవారం సంఘం ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.4లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కేపీ అంబుసా, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఈరన్న, లక్ష్మీనారాయణ, అంబదాస్, మల్లికార్జున్, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లిలో పారిశుద్ధ్య కార్మికురాలు గంధం గోవిందమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ. 15 వేలు ఆర్థికసాయం అందజేశారు. గంధం గోవిందమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో బీఆర్ఎస్ నాయకుడు ప్రమోద్‌కుమార్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తేజ, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన బోరెల్లి ఎల్లయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీరంగాపురం మండల మేఘారెడ్డి యువసేన ఆధ్వర్యంలో తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.10వేలు పంపించారు. యువసేన సభ్యులు శుక్రవారం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య శంకరమ్మకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా సభ్యులు గంధం రంజిత్‌కుమార్, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నా గౌడు, గంధం సునీల్, ఈశ్వరయ్య, శ్రీహరి, శంకర్‌నాయుడు, ఆశన్న, భీమన్న, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఆర్డీఓ చంద్రకళ



అలంపూర్‌లో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మంజుల

మానవపాడు: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ చంద్రకళ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అన్ని గ్రామపంచాయతీల్లో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిపారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్: పట్టణంలో ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మంజుల, ఎంఈఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు పొందాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

రాజోళి: మహిళలు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ కోరారు. మండల కేంద్రంలో బీఎల్ఓలతో కలిసి మహిళా ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు సామాజిక బాధ్యత అని, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు.

శాంతినగర్: మహిళా ఓటర్ల శాతం పెంచేందుకు గ్రామపంచాయతీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ రవీంద్ర తెలిపారు. మండలంలోని బుడమర్సులో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి సత్య, ఏపీఓ విజయలలిత పాల్గొన్నారు.

ఉండవెల్లి: ఓటుహక్కుపై అందరికీ అవగాహన ఉండాలని సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జయంతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అస్మా, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రాఘవ కోరారు. ఇటిక్యాలలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో కొత్తగా 14మంది యువ మహిళా ఓటర్లు నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. మండల వైద్యాధికారి రమేష్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మల్దకల్: ఓటు ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు రాజు, తిరుమలేష్ అన్నా రు. మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో 'ఓటు విలువ తెలుసుకో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ఎలాంటి ఒత్తిడి, ప్రలోభాలకు గురై ఓటును వృథా చేయొద్దని కోరారు. రవి, గోపాల్, శివ, మహేంద్ర, రాజు, విష్ణు, తిరుమల్, శివ పాల్గొన్నారు.



ఉండవెల్లిలో..



మల్దకల్‌లో..



రాజోళిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



శాంతినగర్ మండలం బుడమర్సులో..

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని మేడికొండలో శుక్రవారం రూ.20లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో అలంపూర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. మేడికొండను మండలంగా ఏర్పాటు చేయాలని కేసీఆర్‌ను కోరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులే పార్టీని గెలిపిస్తాయన్నారు. అనంతరం మండల కేంద్రంలో పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంటల్లో ఎర్రతెగులును నివారించాలి



మానవపాడులో మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

మానవపాడు: పత్తి, మిరప పంటల్లో ఎర్రతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలతో పంటలకు ఎర్రతెగులు ఆశిస్తోందని తెలిపారు. దీన్ని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి మొక్క మొదళ్ల వద్ద తడిచేటట్లు పిచుకారీ చేయాలని సూచించారు. పంటలో కలుపు లేకుండా చూడాలన్నారు. భూమిలో తేమకు అనుగుణంగా ఎకరాకు 20కిలోల యూరియా, 15కిలోల సూపర్, 10కిలోల పోటాష్ మిశ్రమం కలిగిన ఎరువులను చల్లితే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. 2023 సీజన్‌కు సంబంధించి సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మణిప్రకాశ్ పాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడులో దెబ్బతిన్న మిరప పంటను ఏఈఓ ఇబ్రహీం పరిశీలించారు. పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అమరవాయిలో మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడంతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి అన్నారు. పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని అమరవాయి, బిజ్వారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణపై గర్భిణులు, బాలింతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాలు కలిగిన ఆహారంపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పద్మమ్మ, లక్ష్మన్న, సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, తిమ్మమ్మ, పద్మమ్మ, పార్వతమ్మ, లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



నేషనల్ హెల్త్ మిషన్ స్కీం ఉద్యోగుల నిరసన



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

గద్వాల: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దర్మదీక్ష శుక్రవారంతో నాల్గో రోజుకు చేరింది. వారి దీక్షకు బీఎస్పీ, బీసీటీఏ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళా ఉద్యోగులు సామూహిక కుంకుమార్చన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగినులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమీ, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామాంజనేయులు, యువరాజు, నర్సింహ పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన..

గద్వాల అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మద్దతు తెలిపి మాట్లాడారు. 9 రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశన్న, హన్మంతు, నర్సింహులు, సిరాజుద్దీన్, హరిప్రసాద్, పరుశరాముడు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

శాంతినగర్: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని పోలీస్ కళాబృందం సూచించింది. ఎస్పీ ఆదేశాల మేరకు వడ్డేపల్లి మండలం కోయిల్‌దిన్నెలో శుక్రవారం పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లతో ఎవరైనా నష్టపోతే 1930 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. బాలికలు, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధిత మహిళలకు భరోసా కేంద్రం అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాధమ్మ, హన్మంతు, కృష్ణ, రామాంజనేయులు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అడ్డుకట్ట వేయాలి



మానవపాడు: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు అధిక ధరలతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో వంటగ్యాస్ ధరను విపరీతంగా పెంచి.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రూ.200 తగ్గించి పేదలపై ప్రేమను వలకబోస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో రాజు, మహబూబ్ భాషా, రామాంజనేయులు, రఫి, అచ్చన్న, భీముడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు మేలు



ధరూరు: ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు మేలు చేకూరుతోందని సర్పంచ్ వీరన్నగౌడ్ అన్నారు. మండలంలోని అల్వాలపాడులో శుక్రవారం ఆరోగ్యశ్రీ కార్డుల అప్‌డేట్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం రూ.2లక్షల పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీని రూ.5లక్షలకు పెంచినట్లు తెలిపారు. పేదలు ఆరోగ్యశ్రీ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



ధరూరులో హిందుశ్రీని సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు



మల్దకల్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ధరూరు: మండల కేంద్రానికి చెందిన డాక్టర్ శ్రీనివాసులు, జానకి కూతురు హిందుశ్రీ ఇటీవల వెలువడిన నీట్‌లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి ఎంబీబీఎస్ సీటు సంపాదించింది. ఈ సందర్భంగా రజక సంఘం జిల్లా అధ్య క్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు టైలర్ అంజి శుక్రవారం విద్యార్థిని హిందుశ్రీని శాలువాతో సన్మానించి అభినందించారు. రజక కుటుంబంలో జన్మించి వైద్యవిద్యలో ముందుకెళ్లడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సవారన్న, నాగరాజు, రామకృష్ణ, ములకలపల్లి నర్సింహులు, మన్యంకొండ, తిమ్మప్ప, కుచినెర్ల నర్సింహులు, గోపాల్, గట్టు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డికి చెందిన శకుంతల, వసంత్‌కుమార్‌ల కుమార్తె సరితారాణి మెడికల్ సీటు సాధించింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత విద్యార్థిని సరితారాణిని సన్మానించి అభినందించారు. ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహబూబ్‌పాషా, ఎండీ గౌస్, వీరన్న, వీరేష్, భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రానికి చెందిన దామ మహేష్, మోహనకృష్ణ మెడికల్ పీజీ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలి సంఘం నాయకులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆర్ఎంపీ భీష్మాచారి కుమార్తె ఎంబీబీఎస్ సీటు సాధించడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటన్న, వెంకటేష్ , శివ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, భీముడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న కిరణ్

కేటీదొడ్డి: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా చదివించాలని ఎంవీఎఫ్ ఫౌండేషన్ కార్యకర్త కిరణ్ కోరారు. మండలంలోని ఉమిత్యాల, మైలగడ్డ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనుల నిమిత్తం విద్యార్థులను బడి మాన్పించి, వారి భవిష్యత్‌ను నాశనం చేయొద్దని కోరారు. పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ బాలికను గుర్తించి పాఠశాలకు పంపించారు. జయరాం, మల్దకల్, పల్లవి, పరిమళ పాల్గొన్నారు.

కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు



మల్దకల్ మండలం మద్దెలబండ పెద్దతండాలో..



వడ్డేపల్లిలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

శాంతినగర్: వడ్డేపల్లి గట్టుపై వెలసిన వసంతమాధవస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజులపాటు వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల చివరి రోజు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

మల్దకల్: మండలంలోని మద్దెలబండ పెద్ద తండా, సద్దోనిపల్లిలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సద్దోనిపల్లిలో స్వామి వారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి రథాన్ని లాగారు. మద్దెలబండ పెద్దతండాలో శ్రీకృష్ణుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, భజన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచులు అశోక్, తాన్యానాయక్, ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, ఆంజనేయులు, మద్దిలేటి, శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కృష్ణమూర్తిచారి, పాండురంగాచారి, ఈఓ పురేందర్ పాల్గొన్నారు.